క్లుప్తంగా

ఎట్టకేలకు పోస్టాఫీస్ రోడ్డుకు మోక్షం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

నరసన్నపేట: మేజర్ పంచాయతీ పరిధిలోని పోస్టాఫీసు రోడ్డుకు (విలేకరుల కాలనీ రోడ్డు) ఎట్టకేలకు మోక్షం వచ్చింది. పంచాయతీ నిధులు రూ.3 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులను ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు మంగళవారం ప్రారంభించారు. గతంలో వేసిన రోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో వాహనదారులు ఈ మార్గంలో తీవ్ర ఇబ్బందులు పడేవారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు సర్పంచ్ బి.శంకర్ రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. రోడ్డు పనులు చేపట్టడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదే మార్గంలో పోలీస్ స్టేషన్, పోస్టాఫీసు ఉన్నాయి.

108 మందికి నేత్ర పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సరుబుజ్జిలి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సరుబుజ్జిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 108 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు కమ్యూనిటీహెల్త్ ఆఫీసర్ ఎం.మోహన్‌రావు తెలిపారు. 12 మంది విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. వారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తామన్నారు. హెచ్ఎం కృష్ణారావు, ఆప్తాలమిక్ అసిస్టెంట్ బాబూరావు, హెల్త్ అసిస్టెంట్ సింహాచలం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం..



నరసన్నపేట: స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, మండల కో–ఆప్షన్ సభ్యుడు, లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు రమణ సాహూని 2025–26 సంవత్సరానికి లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్‌గా నియమించారు. ఈ మేరకు లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ (316ఏ) డి.సూర్యప్రకాశ్ నియామకపత్రం పంపారని రమణ సాహూ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా రమణ సాహూ మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. తన పరిధిలోని శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాలవలస, పొందూరు, టెక్కలి లయన్స్ క్లబ్‌ల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.


నేత్ర శస్త్ర చికిత్సలకు 12 మంది ఎంపిక



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న జానకిరామయ్య

కొత్తూరు: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో మంగళవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 45 మందికి కొత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆప్తాలమిక్ ఆఫీసర్ జానకిరామయ్య కంటి పరీక్షలు నిర్వహించారు. 12 మందిని కంటి ఆపరేషన్లు చేసేందుకు గుర్తించారు. వీరికి రాగోలు జెమ్స్ ఆస్పత్రికి ప్రత్యేక వాహనం ద్వారా పంపించారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

రుచి, శుచి తప్పనిసరి



గుండవల్లిపేటలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ శాంతారావు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నాణ్యంగా, రుచికరంగా పెట్టాలని ఎంఈఓ శాంతారావు వంట మహిళలకు సూచించారు. మండలంలోని గుండవల్లిపేట ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. విద్యర్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ విధిగా అమలు చేయాలని, భోజనంలో తేడాలు ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధ్యాయులు, వంట మహిళలకు సూచనలు చేశారు. అనంతరం జ్యోతీరావు పూలే పాఠశాలను పరిశీలించారు. బోధనకు సంబంధించిన విషయాలపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

సిఫార్సుల మేరకే ఎరువులు వాడండి

పోలాకి: వ్యవసాయశాఖ అధికారుల సిఫార్సుల మేరకే ఎరువులు వినియోగించాలని నరసన్నపేట ఏడీ ఎల్.వి.మధు సూచించారు. రహిమానుపురం సచివాలయం పరిధిలో మంగళవారం ఎరువులు పంపిణీ చేశారు. ఏడీ మాట్లాడుతూ మితిమీరిన ఎరువుల వినియోగం వల్ల కృత్రిమ కొరతతోపాటు నేల స్వభావం దెబ్బతింటుందన్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యతతోపాటు అదనపు పెట్టుబడి కట్టడికి రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు. ఏఓ చిరంజీవి, పీఏసీఎస్ డైరెక్టర్ పూజారి లచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

కడగండి.. ఆశలకు గండి!

- రిజర్వాయర్ సరే.. కాలువలేవీ?
- తీరని అన్నదాతల కల
- దశాబ్దాలుగా ఇదే పరిస్థితి
- ఆశగా ఎదురుచూస్తున్న రైతులు



కడగండి రిజర్వాయర్

హిరమండలం: మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు కడగండి రిజర్వాయర్‌ను ఎల్.ఎన్.పేట మండలంలోని జంబాడ గ్రామ వద్ద నిర్మించారు. ఏ ప్రాజెక్టుకు అయినా కాలువలే ముఖ్యం. కానీ ఈ రిజర్వాయర్‌కు మాత్రం కాలువలు నిర్మించలేదు. దీంతో పొలాలకు సాగునీరు అందని పరిస్థితి. పాతపట్నం నియోజకవర్గంలోని ఎల్.ఎన్.పేట, ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి మండలాల రైతుల బాధలు వర్ణనాతీతం. రిజర్వాయర్‌లో నీరు ఉన్నా ఉపయోగించుకోలేని దుస్థితి వారిది. అధికారులు మాత్రం ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు పంపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. తాము అధికారంలోకి వచ్చిన మరుక్షణం రిజర్వాయర్‌ను ఆధునీకరించి కాలువల నిర్మాణం చేపడతామని కూటమి నేతలు హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఎటువంటి కదలిక లేదు. ఈ ఖరీఫ్‌లో కూడా అదే పరిస్థితి అని తేలిపోయింది.

రెండు దశాబ్దాల కిందట నిర్మాణం..

ఎల్.ఎన్.పేట జంబాడ వద్ద 2005లో కడగండి జలాశయం నిర్మాణానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 81 ఎకరాల్లో రెండు కొండల మధ్య రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. రిజర్వాయర్‌తోపాటు కాలువల నిర్మాణానికి రూ.19.51 కోట్లు మంజూరు చేశారు. రూ.2 కోట్లతో ప్రధాన రిజర్వాయర్ నిర్మాణం పూర్తయింది. కాలువల నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అది మొదలు నిర్లక్ష్యం కొనసాగుతూ వచ్చింది. మధ్యలో వచ్చిన టీడీపీ ప్రభుత్వం కాలువల నిర్మాణానికి భూసేకరణ చేపట్టింది. కానీ రైతుల ఖాతాల్లో పరిహారం జమ చేయలేదు. దీంతో కాలువల నిర్మాణం మళ్లీ మొదటికి వచ్చింది. ఎడమ కాలువకు అనుసంధానించేందుకు వయోడెక్టు నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారు. కాలువలు లేకపోవడంతో కొండలపై నుంచి వస్తున్న నీరు కిందకు వెళ్లిపోతుంది.

ఈ గ్రామాలకు లాభం..

కాలువలు నిర్మాణం పూర్తయితే ఎల్.ఎన్.పేటతో పాటు సరుబుజ్జిలి మండలంలో పదుల సంఖ్యలో గ్రామాలకు ఎంతో ప్రయోజనం. ఎల్.ఎన్.పేట మండలంలోని వలసపాడు, బొర్రంపేట, జంబాడ, ముంగెన్నపాడు, కరకవలస, మల్లికార్జునపురం, శ్యామలాపురం, కుసుమలపాడు, గ్రామాలకు ప్రయోజనకరంగా ఉంటుంది. అటు కుడి కాలువ నిర్మాణం పూర్తయితే ఎల్.ఎన్.పేట మండలంలోని జంబాడ, సరుబుజ్జిలి మండలంలోని అమృతలింగా నగరం, గోనెపాడు, బొప్పడాం, కూనజమ్మన్నపేట, సరుబుజ్జిలి. తదితర గ్రామాలకు ఉపయోగంగా ఉంటుంది. ఎందుకంటే ఈ గ్రామాల్లోని పొలాలు వంశధార కుడి ప్రధాన కాలువకు ఎగువన ఉంటాయి. ఈ కాలువ నుంచి సైతం వీటికి నీరు అందదు. కనీసం ఎత్తిపోతల పథకాలు సైతం లేవు. అందుకే కడగండి రిజర్వాయర్‌కు సంబంధించి కుడి, ఎడమ ప్రధాన కాలువలు నిర్మిస్తే ఈ రెండు మండలాల్లో మెట్ట ప్రాంతాలుగా ఉన్న ఈ గ్రామాల్లోని వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయి.

కాలువలు నిర్మించాలి



కడగండి రిజర్వాయర్‌కు సంబంధించి కాలువల నిర్మాణం చేపట్టాలి. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. అటు వంశధార కుడి కాలువ నీరు అందడం లేదు. ఎగువ ప్రాంతాలు కావడమే అందుకు కారణం. అదే కాలువలు నిర్మిస్తే ఏడాదికి రెండు పంటలు సైతం పండించుకోగలం.

– బొడ్డేపల్లి రాములు, రైతు, బొర్రంపేట, ఎల్.ఎన్.పేట మండలం

మా వెతలు తీరనివి..



దశాబ్దాలుగా మా వెతలు తీరనివి. రిజర్వాయర్ నిర్మాణంతో మా బతుకులు మారిపోతాయని ఆశించాం. పంటలకు సాగునీరు పుష్కలంగా అందుతుందని భావించాం. కానీ రిజర్వాయర్‌ను నిర్మించి కాలువలను మరిచిపోయారు. ఇది చాలా బాధాకరం. కనీసం కూటమి ప్రభుత్వమైనా స్పందించి చర్యలు చేపట్టాలి.

– కింతలి రవికుమార్, రైతు, వలసపాడు, ఎల్.ఎన్.పేట మండలం

నీలమణిదుర్గ ఆలయానికి భక్తుల తాకిడి



క్యూలో ఉన్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రులు ఆరాధ్య దైవం, పాతపట్నం గ్రామ దేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణం మాసం సందర్భంగా తెల్లవారుజాము నుంచే స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు చేశారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రసాదరావు, నాయకులు

కొత్తూరు: ఇళ్లకు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కొత్తూరులో ప్రజా సంఘాల నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. 'మా కొద్దు.. స్మార్ట్ మీటర్లు' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగిస్తే పగలు గొట్టండని ప్రజలకు పిలుపునిచ్చారని, నేడు స్మార్ట్ మీటర్లు బిగించాలని ప్రజలపై ఆయనే ఒత్తిడి తీసుకురావడం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పేదలపై విద్యుత్ బిల్లుల భారం మరింత పెరుగుతుందన్నారు. అదానీకి లాభం చేకూర్చేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. స్మార్ట్ మీటర్లు, ట్రూ అఫ్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 5వ తేదీన విద్యుత్ సబ్ స్టేషన్ల ఎదుట ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు నిమ్మక అప్పన్న, కృష్ణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



కోతకు గురైన రహదారిని పరిశీలిస్తున్న ఎస్ఈ సత్యనారాయణ, అధికారులు

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలంలోని తురకపేట, దబ్బపాడు గ్రామాల మధ్య రాకపోకలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణ తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు తురకపేట కడపలవాని గెడ్డ వద్ద కోతకు గురైన రహదారిని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి ఏటా వర్షా కాలంలో కడపలవాని గెడ్డ వద్ద వరదలతో రాకపోకలకు ఆటంకం కలుగుతుందన్నారు. వందల ఎకరాల పంట నీట మునుగుతుందన్నారు. కొన్నేళ్లుగా గ్రామస్తులు ఇక్కడ వంతెన నిర్మించాలని కోరారన్నారు. ఎస్‌డీఎంఎఫ్ నిధులు రూ.67 లక్షలతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో మధ్యలోనే పనులు నిలిచిపోయాయన్నారు. ఈఈ తిరుపతిరావు, ఏఈ గోపాలరావు ఉన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి



పైడి రమణ

ఆమదాలవలస: మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్)తో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కుటుంబాలు ఆకలి కేకలతో అలమటిస్తున్నారని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ అధ్యక్షుడు పైడి రమణ మంగళవారం ఒక ప్రకటలో ఆవేదన వ్యక్తం చేశారు. మే నెలలో జీతం ఇవ్వలేదని, కనీసం జూన్, జూలై నెలల జీతాలైనా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో చాలా మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులకు దూర ప్రాంతాలకు బదిలీ చేశారని, జీతాలు లేక బస్సు చార్జీలు కూడా చెల్లించలేని దయనీయ స్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీవితం చివరి దశలో ఉద్యోగంలో చేరినందున పన్నెండు నెలల జీతం చెల్లిస్తూ, 62 ఏళ్ల వరకు సర్వీసు పొడిగించాలని, పెన్షన్ అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి ఎంటీఎస్ ఉపాధ్యాయులను ఆదుకోవాలని కోరారు.

ఆమదాలవలసలో వైద్య శిబిరం

గఆమదాలవలస:



చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు సుధాకర్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, కళాశాల పరిసర ప్రాంతాలకు చెందిన చిన్నారులకు ప్రజా వైద్యశాల వైద్యుడు, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ డైరెక్టర్ డాక్టర్ చాపర సుధాకర్, ప్రభుత్వ వైద్యాధికారి పూజిత వైద్య సేవలు అందించారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షురాలు చాపర విజయలక్ష్మి, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ నరసింహారావు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వి.టి.చౌదరి, జె.కె.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



పేషెంట్లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహ ప్రసాద్ పండా

మెళియాపుట్టి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీడీఓ నరసింహ ప్రసాద్ పండా మంగళవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యులు సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మందుల నిల్వలు, అవుట్ పేషెంట్ ఓపీ రికార్డులను పరిశీలించారు. పలువురు పేషెంట్లతో మాట్లాడారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డాక్టర్ అలేఖ్య, కార్యదర్శి కిశోర్, వైద్యశాఖ సిబ్బంది ఉన్నారు.

వరుస పద్ధతిలో వరి నాట్లు వేయాలి



నాట్లు వేస్తున్న మాస్టర్ ట్రైనర్ రమణ, కూలీలు

సారవకోట: వరుస పద్ధతిలో వరి నాట్లు వేయాలని సేంద్రియ వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ టి.రమణ సూచించారు. మండలంలోని చీడిపూడి గ్రామంలో గేదెల లక్ష్మికి చెందిన వరి పొలంలో లైన్ సోయింగ్ పద్ధతిలో మంగళవారం వరి నాట్లు వేశారు. ఈ విధంగా నాట్లు వేయడం వలన మొక్కకు గాలి, వెలుతురు, సూర్యరశ్మి బాగా తగులుతాయన్నారు. దీని వలన మొక్క ఏపుగా పెరిగి, అధిక దిగుబడి వస్తుందన్నారు. నాట్లు మధ్యలో 25 సెంటీమీటర్లు దూరం ఉండాలన్నారు.

సంక్షిప్తంగా..

హోమియో వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధుల నయం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు ఉమాగౌరీ

సారవకోట: హోమియో వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయని తెంబూరు ప్రభుత్వ హోమియో వైద్యురాలు ఉమాగౌరీ అన్నారు. మంగళవారం మండలంలోని వాండ్రాయి గ్రామంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వర్షాలు కురుస్తున్నందున్న వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

వసతిగృహాలు పరిశుభ్రంగా ఉంచాలి



వసతిగృహ అధికారికి సూచనలిస్తున్న ఎంపీడీఓ

సారవకోట: మండల కేంద్రంలోని సమీకృత వసతి గృహాన్ని ఎంపీడీఓ మోహన్‌కుమార్ మంగళవారం సందర్శించారు. వసతిగృహం ఆవరణలో ఉన్న బోరు నీటిని పరిశీలించారు. ఆ నీటిని విద్యార్థులు తాగడానికి ఉపయోగపడదని గుర్తించారు. ప్రత్యామ్నాయంగా రక్షిత మంచినీటి పథకం ద్వారా అందిస్తున్న తాగునీటిని వసతిగృహానికి ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు తక్కువ ఎత్తులో నిర్మిస్తున్నట్లు గుర్తించారు. వాటి ఎత్తును పెంచాలని సంబంధిత కాంట్రాక్టర్ సూచించారు.

శక్తి యాప్‌పై అవగాహన

ఆమదాలవలస: మహిళలు, బాలికలు అత్యవసర సమయాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శక్తి టీమ్ అండగా ఉంటుందని ఎస్ఐ గేదెల వాసుదేవరావు అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు శక్తి టీమ్ ఆధ్వర్యంలో పురపాలక సంఘం పరిధి చింతాడ గ్రామంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శక్తి యాప్‌పై మగళవారం అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో 100, 112, 1091, 1930 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందిస్తే వెంటనే పోలీసులు రక్షణ కల్పిస్తారన్నారు. బాల్య వివాహాలు జరిగితే సమాచారం ఇవ్వాలన్నారు. శక్తి టీమ్ ఏఎస్ఐ డి.రమణ మూర్తి, కానిస్టేబుల్ మోహన్‌రావు, మహిళా కానిస్టేబుల్ ఉషారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్షిద్దాం.. చదివిద్దాం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సారిక

జలుమూరు: ఆడ పిల్లలను రక్షిద్దాం.. చదివిద్దాం అని జలుమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ జామి సారిక అన్నారు. మంగళవారం కాలేజీలో వన్ స్టాప్ సెంటర్లపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళలకు స్వీయ రక్షణ ముఖ్యమన్నారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, గృహ హింస, మానవ అక్రమ రవాణా, తదితర అంశాలను వివరించారు. ఆడ పిల్లలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా 100, 1098, 181, 112 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. బాలికలు ఉన్నత విద్యనభ్యసించి అత్యున్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధులు వై.హిమ బిందు, బి.కవిత, తదితరులు పాల్గొన్నారు.



సారవకోట: చిన్నగుజ్జువాడలో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు



జలుమూరు: టెక్కలిపాడులో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న ఎంపీపీ గోపి, నాయకులు



మెళియాపుట్టి: సుందరాడలో క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలంలోని గొట్టిపల్లిలో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

'కూటమిది నయవంచక పాలన'

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ నాయకులు అన్నారు. ఆమదాలవలస మండలంలోని రామచంద్రపురంలో పార్టీ మండల అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, సర్పంచ్ చల్ల ఉష ఆధ్వర్యంలో, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, మాజీ కౌన్సిలర్ పొన్నాడ కృష్ణవేణి, దుంపల శ్యామలరావు ఆధ్వర్యంలో పాతినవారి వీధిలో మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రికాలింగ్ మేనిఫెస్టో కార్యక్రమాలకు చింతాడ రవికుమార్ హాజరయ్యారు. నరసన్నపేట మండలంలోని ఉర్లాం, బాలసీమ గ్రామాల్లో ఎంపీపీ ఆరంగి మురళి ఆధ్వర్యంలో, పోలాకి మండలంలోని రాళ్లపాడు, కుసుమపోలవలస గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు ఆధ్వర్యంలో, సారవకోట మండలంలోని చిన్నగుజ్జువాడ, అన్నుపురం, కొమ్మసరియాపల్లి గ్రామాల్లో సారవకోట పార్టీ మండల అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ ఆధ్వర్యంలో, జలుమూరు మండలంలోని టెక్కలిపాడు, బసివాడ గ్రామాల్లో ఎంపీపీ వాన గోపి, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, జిల్లా కార్యదర్శి మొజ్జాడ శ్యామలరావు ఆధ్వర్యంలో, మెళియాపుట్టి మండలంలోని నడసంద్ర, పెద్దపద్మాపురం, కొత్తూరు గ్రామాల్లో పార్టీ మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు ఆధ్వర్యంలో, ఎల్.ఎన్.పేట మండలంలోని గొట్టిపల్లి గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, జిల్లా అధికార ప్రతినిధి శిమ్మ సాంబశివరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కూటమి నాయకుల మోసాలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: రామచంద్రాపురంలో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు



నరసన్నపేట: ఉర్లాంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పోలాకి: కుసుమపోలవలసలో క్యూఆర్ కోడ్‌ను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆమదాలవలస: మున్సిపాలిటీలోని పాతినవారి వీధిలో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు